క్లుప్తంగా

శ్రీవారి పాదాలను తాకిన సూర్యకిరణాలు



తిరుమలేశుని పాదాలను తాకిన సూర్యకిరణాలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం ఉదయం 6.30 గంటలకు అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. వేకువ జామునే తిరుమలేశునికి సుప్రభాత సేవ, తోమాల సేవలతో పూజలు ప్రారంభమయ్యాయి. అలా సూర్యకిరణాలు శ్రీవారి పాదాలకు తాకిన అద్భుత ఘట్టం భక్తులకు కనువిందు చేసింది. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి పులకించి పోయారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. 1100 మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం



రుద్ర హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు దరి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ 59వ వార్షికోత్సవం సందర్భంగా వేకువజామున ఉమారామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం రుత్వికులు, వేద పండితుల ఆధ్వర్యంలో మహాశివునికి రుద్రాభిషేకం, రుద్ర హోమం జరిపారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి బాటలో నడవాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లేటి శ్రీనివాసరావు, ధర్మాల కనకరెడ్డి, సురేంద్ర, నడుపూరు శ్రీనివాస్, నరసింహరాజు, కొవిరి ధనరాజు, సుధాకర్ శర్మ, చంద్రశేఖర్, నాగేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కుటుంబాలకు నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని పెదమడక, కొండయ్యవలస, బీసీ కాలనీ, గాజువాక ప్రాంతానికి చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె, ఇతర నిత్యావసర సరకులు అందించారు. పెదమడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద శనివారం వీటిని అందించారు. ఉక్కు అధికారి ఇమంది సత్యనారాయణ, సౌజన్య సరకులు సమకూర్చారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామఅప్పారావు , ట్రస్ట్ చైర్మన్ మస్తాన్‌రెడ్డి, కిడిమి హనుమంతురావు, లక్కరాజు రాము, బొండా ఈశ్వరరావు, విందుల రాజు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన ఫ్లాష్‌మాబ్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గాజువాక: నీటి సంరక్షణపై సృష్టి స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం కోసం విద్యార్థులు పాతగాజువాకలోని సీఎంఆర్ సెంట్రల్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. నీటి వృథాను తగ్గించడం, భవిష్యత్‌లో నీటి కొరత ముప్పు వంటి కీలకాంశాలను హైలెట్ చేస్తూ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల డైరెక్టర్ పి.సుశీల రాణి, మేఘన పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

కూర్మన్నపాలెం: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను దువ్వాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీ ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలు.. మంగళపాలేనికి చెందిన రౌడీషీటర్ కక్కల వెంకటమహేష్, సిద్ధార్థనగర్‌కు చెందిన కుప్పర్లవర్ధన్, వడ్లపూడికి చెందిన వనపల్లి మహేష్ బైకుపై గంజాయి తరలిస్తుండగా రైల్వే స్టేషన్ రోడ్డులో పట్టుబడ్డారని తెలిపారు. వారి నుంచి 1.545 కిలోల గంజాయి ,01 గ్రామ్‌డ్రగ్ పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రెండు సెల్‌ఫోన్లు బైకు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అంతా మా ఇష్టం!





నిబంధనలు అతిక్రమించి రోడ్డుమీదకు చేపడుతున్న నిర్మాణం



గ్రామంలో జీవీఎంసీ కార్యాలయం మలుపు వద్ద ఇలా..



సర్వీసు రోడ్డు నుంచి మూర్తి డాక్టర్ క్లినిక్ ఎదురుగా రోడ్డు దుస్థితి



మురుగునీరు వెళ్లడం కోసం పైపు అమర్చి వదిలేసిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: కొందరి స్వార్థం వల్ల అందరూ ఇబ్బందిపడుతున్నారు. సొంత అవసరాలకు కోసం రోడ్లను ఇష్టానుసారం తవ్వేయడంతో రాకపోలకు అవస్థలు పడుతున్నారు. వీరి చర్యల వల్ల పలు చోట్ల మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది.ఇంతా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు గ్రామంలో ప్రధాన రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా చోద్యం చూడడం గమనార్హం. ఇదంతా జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో దుస్థితి. అలాగే అక్కిరెడ్డిపాలెంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇదేమని అడిగితే మీ ఇష్టం వచ్చిన వారికి ఫిర్యాదు చేసుకోండని దౌర్జన్యంగా మాట్లాడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో సుమారు 200 మీటర్ల వరకు నిర్మాణాలు చేపడుతున్నా అడిగే నాధుడే లేదు. దీంతో స్కూల్స్‌బస్సులు, ట్రాక్టర్లు, జేసీబీలు, కార్లు, ఆటోలు రోడ్డులో ప్రయాణించే టప్పుడు తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది.అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో కొనమెరుపు. సదరు నిర్మాణదారుడు మాత్రం నేను ఒక్కడినే రోడ్డుపై కట్టానా, నా పక్కనున్న నిర్మాణదారులను ప్రశ్నించరా అని వితండ వాదం చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

గుంతలతో ఫీట్లు

హైవే సర్వీసు రోడ్డు మూర్తి డాక్టర్ క్లీనిక్ ఎదురుగా వెళ్లే రోడ్డు వివేకానందకాలనీ అభయాంజనే స్వామి ఆలయం వరకు కొనసాగుతుంది. ఈ రోడ్డును పలు పనుల నిమిత్తం పూర్తిగా తవ్వేయడంతో రాళ్లు తేలి గతుకుల మయంగా తయారైంది. దీంతో రాత్రి సమయంలో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సైతం గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు అతీగతీ లేదు. సమస్యలపై మాట్లాడితే ఎవరు తమపై దాడులకు తెగబడతారోనని మౌనంగా ఉంటున్నామని స్థానికులు చెప్పడం విశేషం.

పైపులు పెట్టారు.. పూడ్చడం మరిచారు

అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారిలో వాటర్ ప్లాంట్ దాటిన తర్వాత దుకాణదారులు కొందరు మురుగు నీరు పోయేందుకు ఏకంగా ప్రధాన రహదారి మధ్యలో తవ్వేసి పైపును అమర్చారు. తవ్వేసిన రోడ్డు పూర్తిగా పెద్ద గాడీలా తయారై వాహనచోదకులు ప్రయాణించే టప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా పూర్తిగా పూడ్చలేదు.అలాగే అక్కిరెడ్డిపాలెం గ్రామంలో మున్సిపల్ కార్యాలయం మలుపు వద్ద రోడ్డు తవ్వేయడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



ప్రియను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయిన బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. జీవీఎంసీ 68వ వార్డు మింది గ్రామానికి చెందిన గుర్రాల ప్రియ (8) మింది జిల్లా పరిషత్ స్కూల్లో 3వ తరగతి చదువుతుంది. తండ్రి సత్యనారాయణ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ప్రియ అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. శ్రీహరిపురం వద్ద తచ్చాడుతుండగా సచివాలయ ఉద్యోగులైన బి.వాసవి, యోగిత గమనించి పాప వివరాలను అడిగి తెలుసుకుని గాజువాక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ నజీర్ తండ్రికి సమాచారం అందించారు. వారు వచ్చిన తర్వాత బాలికను అప్పగించారు.

అన్నదాన నిధికి విరాళం అందజేత




ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం నిర్వహించే అన్న ప్రసాదాలకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన శ్రీనివాస్, వెంకటలక్ష్మి దంపతులు శనివారం రూ.10116 విరాళం అందజేశారు.దాతలకు స్వామి దర్శనం కల్పించి పండితులు ఆశీర్వాదం ఇచ్చారు.

హౌస్ కమిటీ భూముల్లో నివాసాల క్రమబద్ధీకరణ

కార్యాచరణ మొదలు పెట్టిన అధికారులు



గాజువాక: గాజువాక హౌస్ కమిటీ భూముల్లో వెయ్యి గజాల లోపు స్థలాల్లోని నివాస గృహాలను క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. భవన యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు తహసీల్దార్ టి.శ్రీవల్లి నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. హౌస్ కమిటీ పరిధిలో నివాసాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో నంబర్ 45ను జారీ చేసింది. ఈ జీవో ప్రకారం 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి గల నివాసాలను క్రమబద్ధీకరిస్తారు. దరఖాస్తుదారులు సంబంధిత కటాఫ్ తేదీనాటికి గల ఆస్తిపన్ను, విద్యుత్ కనెక్షన్‌తో పాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉంటే వాటిని కూడా అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

ఇదిలా ఉండగా మండలంలో అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న వెయ్యి గజాల లోపు నివాస గృహాలను కూడా క్రమబద్ధీకరించేందుకు జీవో నంబర్ 35ను విడుదల చేసిన విషయం తెలిసిందే. 2019 అక్టోబర్ 15నాటికి ఆస్తిపన్ను, విద్యుత్ కనెక్షన్లు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పేర్కొన్నారు. తమకు సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తులను అందజేయవచ్చని, సర్వే అనంతరం క్రమబద్ధీకరణ పట్టాలు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. క్రమబద్ధీకరణ అవసరంలేనివారు ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేయాలని..లేనిపక్షంలో ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

ఉక్కు కార్మికుల కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న కార్మిక నేతలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం చేపట్టి 1500 రోజులు పూర్తి అయిన సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం కార్మికనేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారంపై అనుసరిస్తున్న విధానాలను దుయ్యబట్టారు.ప్రభుత్వం తమవిధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు మంత్రిరాజశేఖర్, సిటు నాయకులు అయోధ్యరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.వి.రమణ,ఇతర కార్మిక సంఘాల నాయకులు మద్దిఅప్పలరాజు,వెంకటరమణమూర్తి, వరసాల శ్రీనివాసరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. ఆర్క ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్, బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో పెంటకోట యుగంధర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని దయాల్‌నగర్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం అయింది. వంశీరెడ్డి రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వినోద్‌బాబు, అనపర్తి త్రినాథ్, భీశెట్టి పవన్‌కుమార్, ఆడారి బాలశ్రీను, బుద్ధా నాగేశ్వరరావు, శ్రీను, గణేష్, నాయుడు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రహదారి వేయండి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం, కాపుతుంగ్లాం, చుక్కవానిపాలెం, ఆర్ హెచ్ కాలనీలకు రహదారి ఏర్పాటు చేసి తర్వాత ఆర్‌వోబీ నిర్మాణ పనులు కొనసాగించాలని ఆటోనగర్ ఐలా కమిషనర్ కిషోర్‌ను వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి కోరారు. ఆటోనగర్ ఐలా కార్యాలయంలో శనివారం ఐలా కమిషనర్‌ను కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఆటోనగర్‌లో నిర్మిస్తున్న ఆర్‌వోబీ వల్ల పలు గ్రామాలకు వెళ్లే లారీలు, కార్లు, బస్సులు వంటి వాహనాలు వంతెన కింద నుంచి వెళ్లలేని పరిస్థితి వస్తుందన్నారు. ఆర్‌వోబీకి ఇరువైపులా సర్వీసు రోడ్డులు నిర్మాంచాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ ఎస్.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

బీజేపీకి 5 శాతం పదవులు కేటాయించాలి

గాజువాక: నియోజకవర్గంలోని ఆలయాల ధర్మకర్తలు,చైర్మన్ల వంటి నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి ఐదు శాతం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు తమ పార్టీలోని ఆశావహుల పేర్లను పార్టీ పెద్దలకు అందజేయనున్నామన్నారు. పాతగాజువాకలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలను గుర్తించి అవకాశం కల్పిస్తామన్నారు. సమావేశంలో గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, కట్ట పద్మ పాల్గొన్నారు.

మెదడుకు పదును పెట్టాలి



ఇంక్యుబేషన్ కేంద్రం వద్ద విద్యార్థులు

అగనంపూడి: విద్యార్థి దశలోనే మెదుకు పదును పెడితే వినూత్న ఆవిష్కరణలు వస్తాయని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. ఏయూలోని ఇంక్యుబేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఇంక్యుబేషన్ కేంద్రం విభాగాధిపతి దివాకర్ స్టార్టప్, ఐడియా హ్యాకథాన్, యుక్త యాప్‌ల గురించి వివరించారు.

ముస్లింల సేవాకార్యక్రమాలు ఆదర్శం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దేవన్‌రెడ్డి



ప్రసంగిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

గాజువాక: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చేపట్టే సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. అంజుమాన్ ఈ గౌస్‌పాక్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అజీమాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ముస్లింలు రంజాన్‌లో కఠోర ఉపవాసాలు ఉంటూ ప్రార్థనలు చేయడం విశేషం అన్నారు. ఈ మాసంలో ముస్లింలు ఇబ్బంది పడకుండా చేపట్టే వితరణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గాజువాక వంటి ప్రాంతాల్లో హిందువులు, ముస్లింలు అనే తేడా ఉండదని, అందరూ సోదరుల్లా కలిసి మెలసి జీవించడం ఇక్కడి సమైక్యతకు, మత సామరస్యానికి నిదర్శనమని అన్నారు. ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. అనంతరం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో 66వ కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, స్థానిక నాయకులు ఎస్ఎండీ గౌస్, మహ్మద్ రఫీ, గంధం వెంకటరావు, నజీర్ అహ్మద్, రబ్బాని, హఫీజ్, దుబాయ్ బాషా, షౌకత్ అలీ, గోమాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదంతో హక్కుదారులకు తిప్పలు

అగనంపూడి: చేసిన తప్పును సరిదిద్దాల్సిన అధికారులు పట్టాదారులు, భూ హక్కుదారులను ముప్పతిప్పలు పెడుతున్నారని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు పేర్కొన్నారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరవాడ మండలం భర్నికం సర్వే నంబర్ 74లో పార్ట్ 3లో 23 సెంట్లు భూమిని హక్కుదారుడి ఖాతాలో కాకుండా వేరే ఖాతాలో నమోదు చేశారని ఆరోపించారు. ఇదే విషయంపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ ముందు అధికారులు అంగీకరించి సరిచేస్తామని చెప్పారన్నారు. అయితే కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పించుకొని ఇప్పుడు 1964లో ఎవరికో అమ్మేశారని తప్పుడు వాదనకు దిగారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల తీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల మాయం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు మాయం కావడం మిస్టరీగా మారింది. గాజువాక క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాలు.. నెల కిందట పాతగాజువాక జంక్షన్‌లో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు గాజువాక స్టేషన్‌కు తరలించారు. తర్వాత వాహనం అదృశ్యమైంది. ఎవరన్నా తీసుకువెళ్లారా అనే సందిగ్ధత నెలకుంది. ఇదిలా ఉంటే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 రోజుల కిందట పట్టుబడిన బుల్లెట్ కూడా కనిపించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో వాహనాలు ఎలా అదృశ్యమవుతున్నాయి. ఇది దొంగల పనా. లేక పోతే పోలీసులు నిర్లక్ష్యమా అనే సందేహం నెలకుంది.

నీటి పొదుపుతోనే మానవాళి మనుగడ



జలదినోత్సవం సందర్భంగా ప్రదర్శన చేస్తున్న కాలనీ వాసులు

కూర్మన్నపాలెం: ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం 87వవార్డు తిరుమలనగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీకి చెందిన పలువురు పాల్గొని జలసంరక్షణపై నినాదాలు చేశారు. భూగర్భజలాలను పరిరక్షించాలని.. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని.. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మంచినీరు ఉంటేనే సజీవమని లేకుంటే నిర్జీవమని పేర్కొన్నారు. అందువల్ల భూగర్భజలాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి కుటుంబం నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. అప్పుడే భవిష్యత్తు తరాలు కూడా మనుగడ సాగిస్తాయన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ పెద్దలు ఉదయ్‌శంకర్, శ్రీరాములు, సన్యాసిరావు, సురేంద్రనాథ్, శ్రీలక్ష్మి, సునీత, చిట్టిలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, వార్డు సెక్రటరీ సంధ్య, మూర్తి పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అగనంపూడి: జీవీఎంసీ 77, 79 వార్డులకు వెళ్లే ప్రధాన పైప్‌లైన్ లంకెలపాలెం సమీపంలోని ఏలేరు కాల్వ వద్ద మరమ్మతులకు గురవ్వడంతో ఆదివారం నీటిసరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కేదారినాథ్ తెలిపారు. ఈ కారణంగా లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, పిట్టవానిపాలెం, దేవాడ, అప్పికొండకాలనీ, మదీనాబాగ్, పరవాడ హౌసింగ్ బోర్డు కాలనీలకు నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు. అసౌకర్యానికి సహకరించాలని ఆయన కోరారు.

స్టార్టప్‌లపై ఆసక్తి చూపాలి

అగనంపూడి: స్టార్టప్ కంపెనీలపై ఆసక్తి ఉంటే ఉన్నతంగా స్థిరపడేందుకు అవకాశాలు ఉంటాయని.. అలాంటి వారికి మంచి ప్రోత్సాహం కూడా లభిస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.సుధీర్ అన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మాస్యూటికల్ కళాశాల విద్యార్థులకు స్టార్టప్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫార్మారంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. మంచి ప్రాజెక్టుతో వచ్చేవారికి ఉన్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు, ఐఐసీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రాజు గారి దొంగలు' చిత్ర యూనిట్ సందడి



రాజు గారి దొంగలు చిత్ర బృందం

అల్లిపురం: నడిమింటి లిఖిత సమర్పణలో నడిమింటి బంగారునాయుడు నిర్మించిన రాజు గారి దొంగలు చిత్ర యూనిట్ శనివారం గాజువాకలో సందడి చేసింది. యూనిట్ సభ్యులు లోహిత్ కల్యాణ్, రాజేష్ కుంచాడ, జోషిత్ రాజ్‌కుమార్, కైలాష్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు గాజువాక శ్రీకన్య కాంప్లెక్స్‌లో ప్రేక్షకులతో కలసి చిత్రాన్ని తిలకించారు.

మెడికల్ షాప్ సీజ్

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని సాయి వెంకటేశ్వర ఎంజీఎస్ షాపులో కాలం చెల్లిన 41 రకాల మందులను అధికారులు గుర్తించారు. ఈ నెల 21న జరిగిన దాడుల్లో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పట్టుబడిన కాలం చెల్లిన మందుల విలువ రూ.90 వేలు ఉంటుందన్నారు. షాపును సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు విజిలెన్స్ విశాఖపట్నం డివిజన్ అధికారి కె.కల్యాణి తెలిపారు.